بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 21.04.2017 (TELUGU)**

**ఈ కాలము ఎంతో క్లిష్టమైనది. దైవ ప్రకోపము అవతరించుచున్నది. తమను తాము అల్లాహ్ తఆలా ప్రీతి మేరకు సిద్ధము చేసుకున్న వారే తమ ప్రాణము, తమ కుటుంబము, తమ సంతానమును కనకరింతురు. నేడు ఆందోళనకరంగా మారుచున్న ప్రపంచ స్థితిగతుల దృష్ట్యా అందరు అల్లాహ్ తఆలాను ఆశ్రయించవలసిన అవసరమున్నది.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 21.04.2017 తేదీన జర్మనీలో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించుట, వారి బైఅత్‌లో చేరుట మన పై అల్లాహ్ తఆలా శుభము, ఉపకారమే. ఈ విషయము మన విశ్వాసములను పెంచుటకు కారణము కావలెను. ఎందుకనగా విశ్వసించిన తరువాత మనము మన విశ్వాసము, నమ్మకములో ముందుకెళ్లనిచో ఇలా విశ్వసించడం లాభరహితమగును. నిస్సంకోచముగా, నిర్భయంగా మనము ఇస్లాం సందేశము అందించవలెను. ముస్లిముల ప్రస్థుత పరిస్థితిని బట్టి, పీడనము, ఆశాంతిని ముస్లిములకు అంటగట్టుచున్నందున ఇస్లాం గురించి ఎక్కువ మాట్లాడకూడదని కొన్ని సార్లు అబ్బాయిలు, అమ్మాయిలు ఇరువురికి ఆలోచన కలుగవచ్చును. వాస్తవానికి ఇతర ముస్లిముల స్థితిని చూచి ఇస్లాం నిజమైన చిత్రమును ప్రపంచానికి చూపుటకు మనకు మరింత ధైర్యము కలుగవలెను. ఎందుకనగా ముస్లిముల ప్రస్థుత స్థితి సత్యనిదర్శనము. ముస్లిములు సత్యమును వీడుదురని, అశాంతి, పీడనము ఏర్పడును, నామమాత్రపు విద్యావంతులు ఇందుకు బాధ్యులగుదురు, ప్రాపంచికము ముస్లిములను జయించును, అప్పుడు మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అవతరించి ఇస్లాం నిజమైన చిత్రమును ప్రపంచానికి చూపునని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి చేసియుండిరి. అహ్మదీయులమైన మనము ఆ మసీహ్ మౌవూద్‌ను విశ్వసించాము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇస్లాం నిజమైన బోధనను, దాని అందమును మనకు చూపినందున వాటిని ఆచరించువారము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కేవలం విశ్వాసాల పరంగా సంస్కరించు సంస్థను మాత్రమే కాక అన్ని రకాల, అన్ని విధాలా ఆచరణపరంగా సంస్కరించు సంస్థను ఏర్పాటు చేయుటకు వచ్చిరి. కనుక ఈ కోణంలో మనమందరము దీనిని పొందుటకు ప్రయత్నించుచున్నామా లేదా అని ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. మన సంఖ్య పెరిగినప్పుడు ప్రపంచములో మన పరిచయం కూడ పెరుగుట సహజమే. ప్రపంచములో పరిచయం పెరిగినప్పుడు విమర్శ ధోరణి కూడ పెరుగును. పెరుగుచున్నది. కనుక మనలోని ప్రతి ఒక్కరు తమ ఆచరణ ప్రామాణికాన్ని మెరుగుపరచుకోవలెనని, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ ఉద్దేశమును పూర్తి చేయవలెనని ఈ సందర్భము మనతో ఆశించుచున్నది.

గత కొద్ది రోజుల నుండి జర్మనీలోని వివిధ నగరములలో మస్జిదుల ప్రారంభోత్సవము, మస్జిదుల శంకుస్థాపన కార్యక్రమములు జరిగినవి. స్థానిక అహ్మదీయుల మంచి ప్రభావము స్థానిక ప్రజలపై గలదని వీటిలో పాల్గొన్న

స్థానిక ప్రజలు, స్థానిక రాజకీయ నాయకుల మాటలతో స్పష్టమగుచున్నది. కాని ఇస్లాం నిజమైన పరిచయం స్థానిక ప్రజలలో కావలసినంత విధముగా కాలేదని కూడ నేను భావించాను. ఎందుకనగా ఇస్లాం నిజమైన బోధన మాకు తెలియదని, ఇస్లాం గురించి మీడియా చూపిన చిత్రమే మాకు తెలుసని చాలా మంది అభిప్రాయపడ్డారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇస్లాం విషయములు మనతో విని ప్రజలు ఎలా తమ ఆలోచనలను మార్చుకుంటారో ఇందుకు కొన్ని ఉదాహరణలు ఇస్తాను ఒక వైద్యులు ఇట్లనిరి. విద్వేషముతో కాక ప్రేమతో వ్యాపించిన ఇస్లాంను నేడు నేను చూచితిని. ఒక మహిళ ఇట్లనిరి. నేడు నేను విన్న విషయములను ఎన్నడు ఏ ముస్లిం నాయకునిచే వినలేదు. మరొక మహిళ ఈస్తర్ గారిట్లనిరి. ఏ ప్రశ్నలను నా హృదయములో పెట్టుకొని నేనిక్కడికి వచ్చానో వాటన్నిటికి మీ ఖలీఫా గారు నాకు సమాధానములిచ్చారు. రేపు ఎవరైనా ఒకరు ఇస్లాం పేరున ఉగ్రవాద దాడి చేసినచో నేనిక్కడ విన్న ఇంత అందమైన విషయములను ప్రజలు మరచిపోయి, ఈ శాంతియుత సందేశమును విస్మరిస్తారని నేను భయపడుచున్నాను. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇదే వాస్తవము. ఇలాగే జరుగుచున్నది. ఇస్లాం స్వచ్ఛమైన చిత్రము ఎన్నడు ప్రపంచానికి కనబడకూడదనే మీడియా ఆశించుచున్నది. అందుకే ప్రేమ, అనురాగము, సంధితో కూడిన సందేశము, దైవ హక్కులు, ప్రజల హక్కులను చెల్లించు సందేశమును వ్యాపింపజేయుటకు మనము కృషి చేయవలెను. కొందరు బుద్ధిహీనులు, నామమాత్రపు ముస్లిములు ఇస్లాం పేరున చేయుచున్న ప్రతికూల విషయములకు బదులు మనము అనుకూల బోధనను ప్రపంచానికి చూపవలెను. గత పండితులు, విద్వాంసులు లేదా గత ఇమాములు, దైవ మిత్రుల ప్రస్థావనము చదివినందున తమ విద్య చాలా పెరిగినది, తమ విద్యకు ఎవరు పోటీగా రాలేరని విశ్వవిద్యాలయములలో చదువుకునే కొందరు అబ్బాయిలు, అమ్మాయిలకు ఆలోచన కలుగవచ్చును. ఈ కీటకము ఎవరి హృదయములోనైనా యున్నచో దానిని తొలగించుకోవలెను. గత విద్వాంసులు, దైవ మిత్రులను ఇక వీడుము. ఇప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సాహిత్యమును చదివితేనే నిజమైన విద్య, ఇస్లాం స్వచ్ఛమైన చిత్రము లభించును. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నిర్ణయించిన తీర్మాణములే ఇప్పుడు నిజమైన తీర్మాణములు. వారి సాహిత్యమును అనుసరించి జమాఅత్ ఖలీఫాలు విశ్లేషించిన విశ్లేషణలే ఇప్పుడు నిజమైన విశ్లేషణలు. వాటిని చదివి తమ విద్యను పెంచుకోగలరు. ఈ కాలములో నిర్ణయాధికారి, న్యాయమూర్తిగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అవతరించిరి. మనము ఈ విషయమును సదా గుర్తుంచుకోవలెను. కనుక వారు చెప్పినదే సత్యము, ఇస్లాం స్వచ్ఛమైన బోధన.

ఈ కాల సంస్కరణ కొరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను అల్లాహ్ తఆలా పంపినప్పుడు వారికి నేరుగా విద్యను కూడ ప్రసాదించెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒక చోట ఇట్లనిరి. విశ్వసించిన వ్యక్తి సందేహమునకు లోను కాకుండా తన విశ్వాసము నుండి నమ్మకము, విజ్ఞానము వరకు అభివృద్ధి చెందవలెను. నమ్మకము లేనిదే ఏమి సాధించలేరు. మీరే స్వయముగా ఆలోచించగలరు. మీరు నా హస్తమున బైఅత్ చేశారు, నన్ను మసీహ్ మౌవూద్, నిర్ణయాధికారి, న్యాయమూర్తిగా నమ్మారు. ఇలా నమ్మిన తరువాత నా ఏదేని నిర్ణయము లేదా కార్యము గురించి మనసులో దురాలోచన లేదా అయిష్టత కలిగినచో తమ విశ్వాసమును గురించి చింతించుము. మసీహ్ మౌవూద్ నిజముగానే నిర్ణయాధికారి, న్యాయమూర్తిగా అని మీరు సహృదయముతో నమ్మినచో అతని ఆదేశము, కార్యమును తు.చ. పాటించగలరు. చెప్పిదని మౌనముగా నమ్ముము. అతని నిర్ణయములను గౌరవించుము. తద్వారా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర మాటలకు గౌరవము, గొప్పతనము ఇచ్చినవారగుదురు.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సాక్ష్యము సరిపోవును. అవతరించే మసీహ్ మౌవూద్ మీకు ఇమామ్, నిర్ణయాధికారి, న్యాయమూర్తిగా అగునని అవి సంతృప్తి కలిగించును. దీనిపై సంతృప్తి కలుగనిచో మరెప్పుడు కలుగును. ఇంకను ఇట్లనిరి. నేను సత్యున్ని కానిచో వెళ్లి సత్యున్ని అన్వేషించుము. కానిప్పుడు మరో సత్యుడు లభించడు. మరో సత్యుడు లభించనిచో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నాకిచ్చిన హక్కును నేను అడుగుచున్నాను.

వారు వ్యతిరేకులను ఉద్దేశించి ఇట్లనిరి. సదుద్దేశముతో నా వద్దకు వచ్చినచో అల్లాహ్ తఆలా నాకు ప్రసాదించినది నేను వారికి అందించేవాడిని. ఆ అల్లాహ్ స్వయముగా వారిని కరుణించును. వారికి అర్థమయ్యేలా చెప్పేవాడు. కాని వారు లోభినతము, అసూయకు గురైనారు. కనుక వారికి నేనెలా నచ్చ చెప్పగలను. కాని నమ్మినవారమైన మనము అల్లాహ్ తఆలాతో సంబంధము ఏర్పరచుకోవలెను. ప్రాపంచికములో పడకుము. ఈ ప్రపంచము తాత్కాలికమైనదే. కనుక మనము పరలోకము గురించి చింతించవలెను. సదుద్దేశముతో సత్యాన్వేషణ కొరకు వచ్చినచో మంచి నిర్ణయములు సంభవించును. కాని చాడీలు, దురుద్దేశము ఆశించినప్పుడు ఏమియును లభించదు. మసీహ్ మౌవూద్ అవతరించినప్పుడు అతన్ని అసత్యుడు, మూర్ఖుడు, ధర్మమును మార్చుచున్నాడని ఆరోపించబడునని కూడ ఇబ్నె అరబి నామముతో హుజజుల్ కిరామహ్‌లో వ్రాసియున్నది. ఇప్పుడు అలాగే జరుగుచున్నది. ఇటువంటి ఆరోపణలు నాపై చేయబడుచున్నవి. తన స్వంత ఆలోచన పుస్తకమును మూసివేసి, స్వంత తాత్పర్యములు చెప్పడం మానేసినప్పుడే మానవుడు ఇటువంటి ఆలోచనల నుండి మోక్షము పొందును. వాటన్నిటిని ప్రక్కకు పెట్టవలెను. ఇతడు సత్యుడా కాదా అని ఆలోచించవలెను. ఇతడు సత్యుడా కాదా అని ఆలోచించుచు అల్లాహ్ తఆలాతో దుఆ చేయవలెను. ఇంకా వారిట్లనిరి. నిశ్చయముగా కొన్ని విషయములు స్పష్టముగా యుండును. కాని సందేశహరులను విశ్వసించినవారు ఒక సమయము వరకు మంచి ఆలోచన, సహనము, స్థిరత్వముతో నిరీక్షింతురు. అనంతరం అల్లాహ్ తఆలా వారికి వాస్తవమును తెలుపును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హయాంలో అనుచరులు ప్రశ్నించకుండా ఎవరో వచ్చి ప్రశ్న వేయాలని నిరీక్షించేవారు. లేనిచో తాము స్వయముగా మౌనము పాటించుచు కూర్చునేవారు. ప్రశ్నించుటకు సాహసించరు. నాకు తెలిసిన మహా గొప్ప పద్ధతి ఏమనగా ప్రవక్తలను గౌవరించవలెను. ప్రవక్త పట్ల గౌరవ మర్యాదలు తెలియని వ్యక్తి నాశనమయ్యే అవకాశ గలదు. అందుకే దురాలోచన కలిగి వుండకూడదని తమ వారికి కూడ వారు ఉపదేశమిచ్చిరి. అనవసరంగా ప్రశ్నలు అడగకూడదు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. మనము ఏ విషయములో సంకోచించవలసిన అవసరం లేదు. కొన్ని వియములలో మహానులు, దైవ మిత్రుల అభిప్రాయములు (భిన్నంగా) యున్నను ఈ నిర్ణయాధికారి, న్యాయమూర్తి ఎదుట ప్రాధాన్యతరహితమైనవి. ఖాతముల్ ఖులఫా, ఖాతముల్ ఔలియా, తుది కాలపు ముజద్దిద్, నిర్ణయాధికారి, న్యాయమూర్తి అవతరించినప్పుడు అతని నిర్ణయములు, అతని విద్యే, ఇస్లాం గురించి అతను చెప్పినదే నిజమైనది. ఇతరములన్నియు పొరపాటే. మనము బైఅత్ చేసిన విషయమును పూర్తి చేయవలెను.

గుర్తుంచుకోవలసిన మరో విషయమేమనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అందించిన సాహిత్యము, పుస్తకములను చదువుట, తద్వారా విద్యను పొంది నిజమైన ఇస్లాం గురించి చెప్పవచ్చును. రోజు వారీ సమస్యలు, విషయములలో ఈ సూచనలనే తప్పనిసరిగా మనము చెప్పవలెను. కనుక ప్రతి అహ్మదీ వారి సాహిత్యము నుండి తాను స్వయముగా ప్రయోజనము పొంది ఇతరులకు కూడ అందిచంవలెను. ప్రపంచము

ఏమనునని మనము చింతించవలసిన అసవరం లేదు. కాని మనము గమనించవలసిన విషయమేమనగా ధర్మము దేనిని తప్పు అన్నదో దానిని మనము కూడ తప్పు అని అనవలెను. ఈ విషయమును ప్రతి అహ్మదీ గుర్తుంచుకోవలెను. అధిక ప్రశ్నలడగడం వలన సంపూర్ణ విధేయత సాధ్యము కాదు. అందుకే అధిక ప్రశ్నలు వేయకూడదని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బోధించారు. సందర్శకుల మనసులో గల ప్రశ్నలను బట్టి సమాధానము చెప్పే సామర్థ్యము ప్రవక్తలలో యుండును. నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సాధారణ దాసున్ని, మా మనసులో గల ప్రశ్నలకు మీరు సమాధానములు ఇచ్చారని నా గురించే చాలా మంది అంటారు. కావున ప్రవక్త ఆలోచన శక్తి ఇంకా ఎంతో గొప్పగా యుండును. వారు చాలా సున్నితముగా సూక్ష్మ విషయాలకు కూడ సమాధానమిత్తురు. అందుకే సమాధానము లేదని భావించకూడదు. సమాధానములు గలవు. కాని విశ్వసించేవారు కూడ విధేయత ఉన్నత ప్రమాణములు కలిగియుండవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అనేక సార్లు తమ జమాఅత్‌ను వారెలా యుండాలో, వారి విశ్వాస స్థితి ఎలా యుండాలో ఉపదేశించారు. ఒక చోట వారు తమ బైఅత్ చేసిన వారినుద్ధేశించి ఇట్లు తెలిపారు. ఈ రోజులలో కాలము చాలా క్లిష్టమైపోయినది. అనేక రకాల దురాచారములు, పొపాట్లు ఏర్పడినవి. ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిస్తానను ఒప్పందము అల్లాహ్ తఆలా ఆస్థానములో చేయు ఒప్పందము. కనుక దీనిని మరణించేవరకు పాటించవలెను. అల్లాహ్ తఆలా ఇష్టానుసారము దైవ భీతి కలిగియుండుము. ఈ కాలము ఎంతో క్లిష్టమైనది. దైవ ప్రకోపము అవతరించుచున్నది. తమను తాము అల్లాహ్ తఆలా ప్రీతి మేరకు సిద్ధము చేసుకున్న వారే తమ ప్రాణము, తమ కుటుంబము, తమ సంతానమును కనకరింతురు. నేడు ఆందోళనకరంగా మారుచున్న ప్రపంచ స్థితిగతుల దృష్ట్యా అందరు అల్లాహ్ తఆలాను ఆశ్రయించవలసిన అవసరమున్నది. అల్లాహ్ తఆలా కొన్ని విషయములను విశ్వసించకపోవడం అతని మాటలన్నిటిని విశ్వసించక పోవడమే అగును. ఒక భాగము షైతాన్‌ది, మరో భాగము అల్లాహ్‌దైనచో అల్లాహ్ తఆలాకు పొత్తు ఇష్టము లేదు. అల్లాహ్ తఆలా వైపు రావడం చాలా కష్టతరమే, ఒక రకంగా మరణమే. కాని ఇందులోనే జీవితము లభించును. తమలో నుండి షైతాన్ భాగమును తీసి పారవేసిన వ్యక్తి పవిత్రుడు. అతని గృహము, మనసు, నగరము అన్ని చోట్ల శుభము అందించబడును. కాని అతని వంతులో కొంచెం వచ్చినచో శుభము కలుగదు. ప్రతి ఒక్కరు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. తమను సంస్కరించుకొన్నచో ఇతర పాపములు కూడ దూరమగును. నేను అన్ని విధాలా పవిత్రున్ని అని ఎవరు ప్రకటన చేయలేరు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన హక్కును మనము చెల్లించువారమగుదుము గాక! (ఆమీన్) ☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.......................................................................

.......................................................................

.......................................................................